ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024 5
అనంతపురం





'ఆఖరి నిద్ర'

వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే కుటుంబ వారిది. ఉదయం భార్యాభర్తలిద్దరూ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేవారు. రోజంతా కష్టపడి సాయంత్రం ఇంట్లో సేదదీరేవారు. రోజూమాదిరే మంగళవారం రాత్రి కూతురితో కలిసి వారి ఇంట్లో నిద్రించారు. కుమార్తెతో సంతోషంగా కబుర్లు చెప్పకుంటూ కునుకులోకి జారుకున్న వారికి అదే ఆఖరి నిద్ర అయ్యింది. అనుకోని ఘటనతో కూతురితో సహా భార్యాభర్తలిద్దరూ శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఇంటిపైకప్ప కుప్పకూలి మీదపడడంతో ముగ్గురూ మృత్యుఒడిలోకి చేరారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం రుద్రంపల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.


గంగన్న


సంధ్య


శ్రీదేవి

- ◆ కుటుంబాన్ని కబళించిన మృత్యువు
- ◆ మిద్దె పైకప్పు కూలి భార్యాభర్త, కుమార్తె మృతి
- ◆ రుద్రంపల్లిలో విషాద ఘటన
- ◆ ఎమ్మెల్యే అమిలినేని దిగ్భ్రాంతి
- ◆ ఘటనపై ఆరా తీసిన నారా లోకేష్

ప్రజాశక్తి -కుందుర్పి

కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామానికి చెందిన కురుబ గంగన్న (43), శ్రీదేవి (38) భార్యాభర్తలు. వీరికి 9వ తరగతి చదువుతున్న కూతురు సంధ్య (14), ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. కుమారుడు అనంతపురంలో హాస్టళ్లో ఉంటూ చదువుతుండగా కూతురు తల్లిదండ్రుల వద్దనే ఉంటూ 9వ తరగతి చదువుతోంది. భార్యాభర్తలు గంగన్న, శ్రీదేవి ఇద్దరూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మంగళవారం రాత్రి వీరిద్దరూ కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు ఇంటి పైకప్పు బాగా తడిసి మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఒకసారిగా కుప్పకూలి కిందపడింది. పైకప్పు మొత్తం నిద్రిస్తున్న ముగ్గురిపై పడడంతో వారంతా అందులో కూరుకుపోయారు. అర్ధరాత్రి సమయం కావడంతో ఎవరూ దీనిని గుర్తించలేదు. బుధవారం ఉదయం గంగన్న తల్లి ఇంటి వద్దకు వెళ్లి చూడగా తలుపులు మూసి ఉండడాన్ని గమనించింది. కిటికీలోనుంచి చూడగా ఇంటి పైకప్పు కూలిన విషయాన్ని గుర్తించింది. వెంటనే ఆమె చుట్టుపక్కల వారి సాయంతో లోపలికి వెళ్లి చూడగా అప్పటికే గంగన్న, శ్రీదేవి, సంధ్యలు పైకప్పు కింద కూరుకుపోయి మరణించారు. ఈ ఘటనతో వారి బంధువులు కన్నీటి పర్యవంతం అయ్యారు.

ఘటనపై ఎమ్మెల్యే అమలినేని దిగ్భ్రాంతి

రుద్రంపల్లి గ్రామంలో ఇంటిపైకప్పు కూలి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శబరిమల యాత్రలో ఉన్న ఆయన ఘటనపై గ్రామ టిడిపి నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.50వేలను అందించే ఏర్పాటు చేశారు. అధికారులను గ్రామానికి పంపి సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.


మిద్దె పైకప్పు శకలాల కింద ఉన్న మృతదేహాలు

మంత్రి నారా లోకేష్ ఆరా

మిద్దె కూలిన ఘటనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. బుధవారం ఉదయం ఆయన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో మాట్లాడారు. ఘటన వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు.

అధికారుల పరిశీలన

రుద్రంపల్లి గ్రామంలో ఆర్డీవో వసంత బాబు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ నగేష్‌లు పరిశీలన చేశారు. ప్రమాద స్థలం వద్దకు వెళ్లి స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత మిద్దె కావడం, వర్షానికి తడవడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపారు. వీరి వెంట సర్పంచి మహదేవమ్మ విజయకుమార్, ఎంపిటిసి మమతా మల్లికార్జున, టిడిపి సీనియర్ నాయకులు వెంకటేష్, కురుబ రామాంజి నేయులు, గంగన్న, మాజీ జెడ్పీటీసీ మల్లికార్జున, కంబదూరు రామ్మోహన్ చౌదరి, కుందుర్పి మండల టీడీపీ అధ్యక్షులు జి.ధనుంజయ, ఎస్.మల్లాపురం నాగేంద్ర పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో మరో విషాదం

కూలిన నిర్మాణంలో ఉన్న పైకప్పు - ఇద్దరు రైతులు మృతి


శివారెడ్డి,


లక్ష్మినారాయణరెడ్డి

ప్రజాశక్తి-చిలమత్తూరు

వ్యవసాయ తోట వద్ద ఉండేందుకు నిర్మాణం చేస్తున్న ఇంటి పైకప్పు ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఇద్దరు రైతులు అక్కడికక్కడే మరణించారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాధ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు శివారెడ్డి(50) పొగాకు పంట సాగు చేస్తున్నాడు. పంట సాగు, కాపలాకు అనుకూలంగా ఉండేందుకు పొలంలో ఓ చిన్న గది నిర్మాణాన్ని చేసుకున్నాడు. ప్రస్తుతం దాని పైభాగాన నల్లబండలు స్లాబ్ వేసుకుంటున్నాడు. నల్లబండల స్లాబ్ కింద వాడిన ఇనుప తీర్లు నాణ్యత లేకపోవడంతో అవి కిందకు కుంగాయి. దీనిని శివారెడ్డి గమనించకోలేదు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పై భాగాన కూలీలు పైన కాంక్రీటు వేస్తుండగా స్లాబు కిందకు కుంగింది. కూలీలు ఈ విషయాన్ని శివారెడ్డికి చెప్పగా ఆయన తన కుమారుడు రాజశేఖర్ రెడ్డి, రైతుకూలీ ఎద్దుల లక్ష్మినారాయణ రెడ్డి(45) సహాయంతో కుంగుతున్న పైకప్పును సరిచేసేందుకు కింది భాగాన కర్రలు అమర్చేందుకు వెళ్లారు. ఇలా వీరు కర్రలు అమరస్తుండగా స్లాబ్ మొత్తం కుప్పకూలి వారిమీద పడింది. దీంతో ఎద్దుల లక్ష్మినారాయణ రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. మిద్దె శకలాల కింద ఉన్న రైతు శివారెడ్డి, అతని కుమారుడు రాజశేఖర్‌రెడ్డిని చికత్స నిమిత్తం బెంగుళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో శివారెడ్డి మరణించాడు. కాగా మిద్దె కూలుతున్న సమయంలో దాని పై భాగంలో ఉన్న కూలీలంతా చాకచక్యంగా పక్కనున్న పొలంలోకి దూకేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8 ఏళ్లుగా పనుల పెండింగ్..!

- ◆ మధ్యలోనే ఆగిన ఎన్‌హెచ్ 67
- ◆ రాప్తాడు వంతెన పరిస్థితీ అంతే
- ◆ రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎనిమిదేళ్లుగా ఆ రహదారి నిర్మాణం జరుగుతూనే ఉంది. ఎప్పటికి పూర్తవుతుందో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్-67 అనంతపురం జిల్లాలో 57 కిలోమీటర్ల మేర ఉంది. ఈ రహదారి నిర్మాణానికి 2016 చేపట్టారు. మూడొంతులు నిర్మాణం జరిగి మధ్యలోనే ఆగింది. కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న విధంగా ఉన్నాయి.

కర్నాటక రాష్ట్రంలో రాంనగర్ నుంచి కృష్ణపట్నం వరకు 778 కిలోమీటర్లు మేరకు ఎన్‌హెచ్ 67 ఉంది. ఈ రహదారి కర్నాటకలోని బళ్లారి జిల్లా నుంచి అంటే గుంతకల్లు నుంచి గుత్తి మీదుగా భోగసముద్రం వరకు ఈ ఎన్‌హెచ్ 67 పోతుంది. నాలుగు వరుసల రహదారి కోసం రూ.539.99 కోట్లతో డాట్, ఎస్ఆర్‌కె జాయింట్ వెంచర్‌గా కాంట్రాక్టును దక్కించుకోవడం జరిగింది. 2016లో ఈ పనులను ఆ సంస్థకు అప్పగించారు. 2022 సంవత్సరం నాటికి ఈపనులను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటిరకు 86 శాతం పనులను పూర్తి చేసి ఆపివేశారు. దీంతో గుంతకల్లు-గుత్తి మధ్యలో అనేక చోట్ల రహదారిలో అడ్డంకులున్నాయి. ఈ అడ్డంకుల క్రమంలో రెండేళ్ల క్రితం ఒక కారు గుంతలో పడి వ్యక్తి చనిపోయారు. ఇప్పటికీ ఈ రహదారులు పనులు మాత్రం అర్థాంతరంగానే ఆగి ఉన్నాయి. కాంట్రాక్టర్ పనులు చేయలేదని అధికారులు పాత కాంట్రాక్టును రద్దుచేశారు. మిగిలిన పనులను ఎప్పటికి చేపడతారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

రాప్తాడు రైల్వే బ్రిడ్జిదీ అదే తీరు

జాతీయ రహదారి 42 నుంచి ఎస్‌కెయును కలిపేందుకు నిర్మించిన బైపాస్ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో రైల్వే గేటు ఉంది. దీని వద్ద బ్రిడ్జి నిర్మాణపు పనులు 2018 నుంచి జరుగుతూనే ఉన్నాయి. తవం కన్‌స్ట్రక్షన్స్‌కు ఈ పనుల బాధ్యతను అప్పగించారు. రూ.55.55 కోట్లతో ఈ పనులను అప్పగించారు. ఈ బ్రిడ్జి పనులను 2022 లోపు పూర్తి చేయాల్సి ఉంది. రూ.37.91 కోట్లు వ్యయం పనులను పూర్తి చేశారు. ఆ తరువాత ఈ సంస్థ పనులను ఆపేసింది. ఈ నిర్మాణం పూర్తికాకపోవడంతో అనంతపురం నగరం నుంచి రాప్తాడు వెళ్లే సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ పనులనూ రద్దు చేశారు. ఇవి కూడా తిరిగి టెండర్లు పిలిచి కొత్త వారికి పనులు అప్పగించాల్సిఉంది. ఈ ప్రక్రియ ఎన్నేళ్లకు పూర్తవుతుందోనని వాహదారులు వాపోతున్నారు. ఇలా కీలకమైన రెండు ప్రధాన రహదారుల పరిస్థితి ఇబ్బందులు నెలకొన్నాయి. వీటిని త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

చిత్రావతి నుంచి బయట ప్రాంతాలకు రవాణా

ప్రజాశక్తి-యల్లనూరు

గహ నిర్మాణాలు, ప్రభుత్వ పనులకు ఉచితంగా ఇసుక తీసుకోవచ్చని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. దీనిని కొందరు అక్రమార్కులు వారికి అనుకూలంగా మార్చుకుని అక్రమంగా ఇసుక తరలింపునకు తెరలేపారు. సచివాలయంలో అనుమతి పొందాల్సిన అవసరం లేకుండానే కొందరు వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నారు. ప్రభుత్వ పనుల పేరుతో చిత్రావతి నది నుంచి ఇసుక ను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ప్రభుత్వ పనులు ప్రారంభమైన గ్రామాల్లో కాకుండా ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. తాడిమర్రి మండలం దాడితోట గ్రామానికి ట్రాక్టర్లలో చిత్రావతి నుంచి ఇసుక తరలుతోంది. యల్లనూరు మండల పరిధిలోని లక్షుంపల్లి గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి నది నుంచి ప్రతి రోజూ ఇలా ఇసుకను ఇతర ప్రాంతాలకు ఇసుకును కొందరు తరలించేస్తున్నారు. ఇందంతా అధికారులకు తెలిసినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఇతర ప్రాంతానికి ఇసుక ట్రాక్టర్లో తరలివెళ్తున్న ఇసుక

చినుకు పడితే చిత్తడే..

గొంచిరెడ్డిపల్లి ఎస్‌సి కాలనీలో బురదమయంగా రోడ్లు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని గొంచిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో చినుకు పడిందంటే చాలు దారులన్నీ చిత్తడిగా మారిపోతున్నాడు. ప్రస్తుతం వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారాయి. దీంతో కాలనీవాసులు బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక బురదలోనే నడుస్తూ వెళ్లుండటంతో చాలామంది కింద పడిన ఘటనలు ఉన్నాయి. కాలనీలోని గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు, ప్రీస్కూల్ విద్యార్థులు స్థానిక అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే బురదలోనే నడవాల్సి ఉంటుంది. దారి బాగు చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లో నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


గొంచిరెడ్డిపల్లి గ్రామంలోని బురదమయంగా మారిన ఎస్సీ కాలనీ రోడ్డు

సచివాలయ కార్యదర్శి ఆత్మహత్య


రాఘవేంద్ర(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలో సచివాలయ కార్యదర్శి మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కంబదూరు కంబదూరు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1లో కార్యదర్శిగా రాఘవేంద్ర(32) పని చేస్తున్నాడు. ఈయన మంగళవారం రాత్రి కార్యాలయంలోనే నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఈయన కార్యాలయంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం సచివాలయం వద్దకు వెళ్లిన సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యాశాఖ అధికారులు అసంబద్ధ నిర్ణయాలను తక్షణమే రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు పెద్దగా తేడా లేదనే విధంగా విద్యాశాఖ అధికారుల నిర్ణయాలు ఉంటున్నాయని విమర్శించారు. పాఠశాలల పనివేళల పెంపు, 10శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని ఆంక్షలు విధించడం, పదవ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ వల్ల సిలబస్ కాక విద్యార్థులను ఉపాధ్యాయులను అయోమయంలోకి నెట్టడం, వంటివి ఇబ్బందులు ఉన్నాయన్నారు. విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదులో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ అపార్ నమోదు తల్లిదండ్రులకు గుదిబండగా మారిందన్నారు. దీనివల్ల ఒక్కొక్కరికి రూ.1వెయ్యి నుంచి రూ.2వేల వరకూ ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఈ అసంబద్ధ, విచిత్ర పరిణామాలను అధికారులు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఈనెల 11న డిఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రమణయ్య సహాధ్యక్షురాలు సరళ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ నాయకులు ఆదిశేషయ్య శ్రీనివాసులు సిద్ధన్న సంపత్ కుమార్ సిద్ధన్న సంపత్ కుమార్ పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఖాతాకోసం పోస్టాఫీసుల వద్ద క్యూ

బారులుదీరుతున్న మహిళలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వం అందించే రూ.1500 లబ్ధి పొందాలంటే పోస్టాఫీసు ఖాతా తప్పనిసరిగా ఉండాలంటూ ఇటీవల పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. దీంతో మహిళలు పోస్టాఫీసు వద్ద క్యూ కడుతున్నారు. పోస్ట్ ఆఫీస్‌లో సేవింగ్స్ ఖాతా ఏర్పాటు చేసేందుకు రాయదుర్గంలో పెద్ద సంఖ్యలో మహిళలు పోస్ట్ ఆఫీస్ వద్ద బారులుదీరుతున్నారు. 18-55 మధ్య వయసు గల మహిళలకు నెలకు 1500 రూపాయలు చొప్పున లబ్ధి చేకూరుస్తూ త్వరలో పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పోస్ట్ ఆఫీస్ లో సేవింగ్స్ ఖాతా తెరిచేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో పోటీపడుతున్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ద్వారా బ్యాంకు ఖాతా ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ లింక్ అయితే ఆ ఖాతాలో నెలకు 1500 రూపాయలు చొప్పున ప్రభుత్వ సంక్షేమ లబ్ధి చేకూరుతుందని ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. రాయదుర్గం పోస్టాఫీసు వద్ద మహిళలు గత వారం రోజులుగా క్యూ కడుతున్నారు. సగటున ఒక్కో ఖాతా ప్రారంభించేందుకు 250 రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఈ విషయమై పోస్టుమాస్టర్ జి.పద్మావతిని వివరణ కోరగా ఖాతాదారుల కోరిక మేరకు ఐపిపిబి సేవింగ్స్ ఖాతాను చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమలబ్ధి ఈ ఖాతాలో జమ అవుతుందో లేదో తమకు తెలియదన్నారు.


ఖాతా కోసం పోస్టాఫీసు వద్ద గుమిగూడిన మహిళలు

ఇదంతా ఒట్టి ప్రచారమే..

పోస్టాఫీస్ ఖాతా తప్పనిసరి అనే ప్రచారం ఒట్టిదే అంటూ ఇటీవల అధికారులు ప్రకటనలు సైతం చేశారు. మహిళలకు రూ.1500 లబ్ధి చేకూరాలంటూ పోస్టాఫీస్ ఖాతా కావాలని ఎవరూ చెప్పలేదు. రూ.1500 పథకానికి సంబంధించి ఇంకా విధివిధనాలూ రాలేదు. ఏ బ్యాంకు ఖాతా అయినా దానికి ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ లింక్ ఉంటే చాలు. ఇవి తెలియక చాలా మంది మహిళలు పనులు మానుకుని పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ఏది ఏమైనా పోస్టల్ ఖాతా, రూ.1500 సంక్షేమ లబ్ధి విషయమై ప్రభుత్వం అధికారికంగా స్పష్టమైన ప్రకటన చేయాలని మహిళలు కోరుతున్నారు.



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎయిడ్స్ ర్యాలీ

పుట్లూరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు మాస్ ఎడ్యుకేషన్, ఆర్గనేజేషన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ మీద పాఠశాల విద్యార్థులు ర్యాలీగా బస్టాండ్ సర్కిల్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.సుధీర్, ప్రాజెక్టు మేనేజర్ జగనాథ్‌రెడ్డి, ఎఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు

17, 18న గుత్తిలో మహాసభలు-ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు ఓతురు పరమేష్, సిద్ధు తెలిపారు. బుధవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేసేందుకు నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చిందన్నారు. ప్రధానంగా రాష్ట్ర విద్యారంగానికి కేటాయించాల్సిన బడ్జెట్‌ను కేటాయించకపోవడం, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యాహక్కులను కేంద్రంలో బిజెపి కలరాస్తోందన్నారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం అధికారంలో వచ్చి ఆరునెలలు కావచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదన్నారు. విద్యార్థులకు తల్లివందనం ఇవ్వలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు ఐదునెలలు నుంచి మెస్ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయలేదన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్‌ఛార్జీలు నెలకు రూ.3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈనెల 17, 18వ తేదీల్లో గుత్తిలో ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు విద్యార్థులు, మేధావులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్ ఉపాధ్యక్షులు సోము,వీరు పట్టణ నాయకులు సాయి, విజయ్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో డ్రైయినేజీ అస్తవ్యస్తం

కూతలేరు వంతెన సమీపంలో అపరిశుభ్రత - ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని కూతలేరు వంక సమీపంలో గవ్వలవీధికి వెళ్లే మలుపు వద్ద డ్రెయినేజీ అధ్వాన్నంగా తయారైంది. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీ నీరు పైకి పొంగి ప్రవహించడంతో పందులకు ఆవాసంగా మారుతోంది. దీనికితోడు ఈగలు, దోమలు అధికమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రెయినేజీని శుభ్రం చేయడంతోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.





నార్పలలోని కూతలేరు సమీపంలో పేరుకుపోయిన మురుగు కాలువ, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

ప్రజాశక్తి-గుంతకల్లు

వైసిపి మండల కన్వీనర్ వాల్మీకి మోహన్




విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ మోహన్

తనపై వచ్చిన అవినీతి, ఆరోపణలు నిరూపిస్తే తన భార్యతో ఎంపిపి పదవికి రాజీనామా చేయిస్తానని వైసిపి మండల కన్వీనర్ వాల్మీకి మోహన్ సవాల్ విసిరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భార్య ఎంపిపి మాధవితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ పనులు చేయకుండానే నిధులు మాయం చేశారంటూ తమపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. నిబంధనల ప్రకారమే పనులు చేసి బిల్లులు తీసుకున్నామన్నారు. చేసిన పనులకే ఇప్పటికీ ఇంకా రూ.20 లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పేరు వాడుకుని పైరవీలు చేస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. తనకు ఎమ్మెల్యే దగ్గరి బంధువేనని, తాను చేసిన పనులకు బిల్లుల విషయమై ఆయన్ను కలిశానన్నారు. ఎక్కడైనా ఏదైనా పనులకు సంబంధించి ఆరోపణలు నిరూపించడానికి ఎప్పుడైనా సిద్ధమేనన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం తనకు లేదన్నారు. తమపై వచ్చిన అవాస్తవాలను నిరూపణ చేస్తే తన భార్యతో రాజీనామా చేయిస్తానని సవాల్ విసిరారు.

'ఉపాధి' అవినీతిపై సమగ్రంగా విచారించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతుసంఘం నాయకులు



మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై సమగ్రంగా విచారించాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేశు డిమాండ్ చేశారు. బుధవారం విడపనకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విడపనకల్ మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల్లో అవినీతి బయటపడిన విషయం తెలిసిందే అన్నారు. అయితే ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. 2023-24లో జరిగిన పనుల్లో సుమారు రూ.కోట్లలో అవినీతి చోటు చేసుకుందన్నారు. మండలవ్యాప్తంగా రూ.11 కోట్ల పనులు జరగ్గా రూ..1.9కోట్ల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు తేల్చారన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని అవినీతి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



ఆసుపత్రికి ఫ్రిజ్‌ను అందజేస్తున్న మన్నేరు కొండమ్మ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషంట్ల వివరాలు, మౌలిక వసతులు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మన్నేరు కొండమ్మ రూ.23వేలు విలువజేసే ఫ్రిజ్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది కొండమ్మను సన్మానించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్, వైద్యాధికారి స్వాతిలక్ష్మి, సభ్యులు మన్నేరు కొండమ్మ, మండల పరిషత్ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హనుమంతురెడ్డి, సిహెచ్ఒ మోహన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ఫార్మాసిస్ట్ మహబూబ్, పిహెచ్ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ సునీత, స్టాఫ్‌నర్స్ శైలజ, పిహెచ్‌సి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ తేజోష్ణ

మరుగుదొడ్లను వినియోగించాలి

ప్రజాశక్తి-పామిడి

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగంచుకోవాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవడంతోపాటు సజావుగా వినియోగించుకోవాలన్నారు. బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలన్నారు. బహిరంగ మలమూత్రం వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజేంద్ర కృష్ణకుమార్, మండల ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ తిరుపాల్‌నాయక్, మండల కోఆర్డినేటర్ రవీంద్ర, పంచాయతీ సెక్రటరీ షామీర్, రాధ, ఎన్‌జిఒ సిఒ లలిత, నగేష్, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించుకోండి

ప్రజాశక్తి ఆత్మకూరు

మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా కోసం బీమా ప్రీమియంను చెల్లించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సుచరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వతేదీ వరకూ గడువు ఉందన్నారు. కావున పంటలు సాగు చేసిన రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ప్రతులను ఆయా రైతు సేవాకేంద్రాలకు తీసుకెళ్లి ప్రీమియం చెల్లించుకోవాలన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్‌డిఒ వసంతబాబు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ వసంతబాబు

మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌డిఒ వసంతబాబు సూచించారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయిలోని కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కణేకల్, బొమ్మనహాల్ మండలాల్లోని వివిధ శాఖల మండల అధికారులకు 'లైంగిక వేధింపుల నివారణ, నిషేధం దిద్దుబాటు చట్టం'పై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు చేసిందన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళల రక్షణ కోసం సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్‌ప్లేస్ ప్రివెన్షన్ ప్రొహిబిషన్ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ లక్ష్మీప్రసన్న, దేవీ యాక్ట్ సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కణేకల్, బొమ్మనహాల్ మండలాల తహశీల్దార్లు, ఎపిఎం రాజేష్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో కార్మికులకు భద్రత కల్పించాలి

అదనపు కలెక్టర్ వినూత్న-డోలమైట్ తరలింపునకు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వినూత్న

భూగర్భగనుల్లో పనులు చేసే కార్మికుల భద్రతపై యజమానులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వినూత్న, ఆర్‌డిఒ కేశవనాయుడు సూచించారు. బుధవారం మండలంలోని కొండుపల్లి సమీపంలో సర్వే నెంబరు 605లో శ్రీరామ మైనింగ్ కంపెనీ యాజమాన్యం డోలమైట్, స్టీటైట్ రాయిని తరలించేందుకు అనుమతులు కోరారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ బుధవారం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం ఎందుకోసం డాక్యుమెంట్ ఇచ్చిందో.. వాటిలోని ప్రతి అంశాన్నీ అమలు చేయాలన్నారు. గనుల ప్రాంతాల్లో ఔషధ మొక్కలతోపాటు పర్యావరణాన్ని కాపాడే పలురకాల మొక్కలను నాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. ఇందుకు గనుల యజమాని వెంకటపతినాయుడు స్పందిస్తూ గ్రామంలో మినరల్ తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేసి మొక్కలు నాటించేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉపారాణి, హరిక, విఆర్‌ఒలు రామాంజనేయులు, సుదర్శనరెడ్డి, సర్వేయర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

వైసిపి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

ప్రజలపై మోపుతున్న విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో ఎపిఎస్‌పిడిసిఎల్ డివిజినల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వైసిపి నాయకులు ప్రదర్శనగా కార్యాలయం చేరుకుని అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ మండల కన్వీనర్లు డి.హుస్సేన్ పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన కూటమి నాయకులు గద్దెనెక్కిన అనంతరం ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం తగదన్నారు. ప్రజల నుంచి వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎడిఇ జి.సాయిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు కె.మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు వి. వరదరాజులు, వాల్మీకి శివ, వెంకటసుబ్బయ్య, నాయకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, బి.రమేష్‌రెడ్డి, ఎం.రంగస్వామి, సివి.రంగారెడ్డి, డి.షఫీ, కొత్తపేట రాము,ఎస్.సుధాకర్, మల్లికార్జున, కెఎం. రంగనాయకులు, రోఫ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పట్టణ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంతకల్లు



పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్

మహాసభలో 22 మందితో సిపిఎం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మారుతీప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులుగా బి.శ్రీనివాసులు, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, సురేంద్రను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ నూతన కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు, కుంటలకు సాగు, తాగునీరు అందించాలని, పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమ నెలకొల్పాలనే తదితర డిమాండ్ల సాధనకు రానున్న కాలంలో పోరాటాలు చేసేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు.

మామిడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మామిడి పంట సాగు చేసిన రైతులు పూతదశలో జాగ్రత్తలను తీసుకోవాలని ఉద్యానవన అధికారి కృష్ణతేజ సూచించారు. బుధవారం ముప్పులకుంట గ్రామంలో రైతులు సాగు చేసిన మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంట పూత దశలో ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపడితే పూత, పిందే దశలో బూడిద తెగులు, తేనమంచు పురుగు, మొదలగునవి సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. అంతేగాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ముప్పలకుంట ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న అధికారులు

వందరోజుల కార్యాచరణ ప్రణాళికను సవరించాలి

ప్రజాశక్తి-అనంతపురం

సబ్జెక్టు నిపుణులతోగానీ, ఉపాధ్యాయ సంఘాలతోగానీ సంప్రదించకుండా విద్యాశాఖ తీసుకొచ్చిన 10వ తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికను సవరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఉరవకొండ మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల తర్వాత 2వ శనివారాలు, ఆదివారాలు, ప్రభుత్వ సెలవులు మినహాయించి ప్రణాళిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ శివయ్య ఆచారి, మండల సీనియర్ నాయకుడు రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



పార్కు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

నగరంలో ఓపెన్ సైట్‌లను పర్యవేక్షించి వాటిల్లో పార్కులను అభివృద్ధి చేస్తామని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. బుధవారం నగరంలోని 39వ డివిజన్ పరిధిలో చేపట్టిన పార్కు అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఓపెన్ సైట్లు అన్యాక్రాంతం కాకుండా కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే స్థానిక ఆనంద్ అపార్ట్‌మెంట్ వెనుక ఉన్న 30సెంట్ల ఓపెన్ సైట్‌కు ఇటీవల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక నిధులు రూ.21లక్షలు వెచ్చించి కాంపౌండ్ నిర్మాణం చేపట్టామన్నారు. ఇందులో పార్కు ఏర్పాటుకు ప్రతిపాదన చేశామని, ప్రస్తుతం లెవలింగ్ పనులు చేపడుతున్నామన్నారు. హైమాస్ లైట్లు, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునే పరికరాల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, ఇఇ రాధాకృష్ణ, ఎఇ హరీష్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15లోపు బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వతేదీలోపు బీమా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని 74 ఉడేగోళంలో రాయదుర్గం డివిజన్‌లోని ఐదు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఈ-పంట నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ 2024 సంవత్సరానికి సంబంధించి పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి బీమా ప్రీమియం చెల్లించేలా చొరవ చూపాలన్నారు. అలాగే పంటలకు వచ్చే చీడపీడల నివారణ చర్యలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, గుమ్మగట్ట, బొమ్మనహాల్, డి.హీరేహాల్, కణేకల్ మండలాల వ్యవసాయ అధికారులు మహేంద్ర, నిర్మల్ కుమార్, అహ్మద్‌బాషా, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-కుందుర్పి

విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాల్లో రాణించాలని తహశీల్దార్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అనంత రుషి డిగ్రీ కళాశాల ఆవరణలో కుసుమగిరి వికలాంగుల మండల సమైక్య అధ్యక్షులు వెంకటేశులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివాంగులు సమాజంలో అందరికన్నా ఉన్నత స్థాయిలో ఎదగాలన్నారు. అనంతరం రామస్వామి ఆలయం నుంచి మేళతాళాలు, డప్పులు, వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరిరామమూర్తి, అఖిల భారతీయ దివాంగుల సేవాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, దృష్టి ప్రముఖ విజయభాస్కర్, కెనరా బ్యాంకు మేనేజర్ ప్రకాష్, రుషీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, మహిళా నాయకురాలు లక్ష్మి, మురుస్వామి, శ్రీనివాసులు, గోవిందనాయుడు, యువరాజు, ఆర్‌డిటి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హోటళ్లలో మున్సిపల్ శానటరీ ప్రజారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా రోజుల తరబడి వాడిన వంటనూనెను తిరిగి ఉపయోగిస్తుండగా గమనించి కాలువలో పారబోశారు. అదేవిధంగా ఫ్రిజ్‌ల్లో నిల్వ ఉంచిన మాంసం నిల్వలు, చట్నీలు, ఇతర ఆహార పదార్థాలు దుర్వాసన వస్తుండడంతో చెత్తకుండీల్లో వేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడుతూ హోటళ్లను నిర్వాహకులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయించరాదన్నారు. ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



తనూజ (పాతచిత్రం)

రాయదుర్గం : మెడిసిన్ సీటు రాక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయదుర్గం పట్టణ పొలిమేరలోని పైవేట సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా సేడం ప్రాంతానికి చెందిన తనూజ అనే యువతి మెడిసిన్ సీటు రాక తాను ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు మంగళవారం తెలిపింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో రాయదుర్గం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మొలకాల్మూరు వైపు వెళ్తున్న రైలులో రాయదుర్గం పట్టణ పొలిమేరలో పైవేట వద్ద రైలు నుంచి దూకి ఆమె ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం రైల్వే గ్యాంగ్‌మెన్ నాగేష్ ఆమె మృతదేహాన్ని గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువతి మృతదేహం సేడం కు చెందిన తనూజాదిగా గుర్తించారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రజాశక్తి-అనంతపురం



వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న అతిథులు

పద్మశ్రీ ఘంటశాల వెంకటేశ్వర్‌రావు జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని లలితకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ముందుగా వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, ఎస్‌కెయు విశ్రాంత ఆచార్యులు సుధాకర్‌బాబు పాటలు పాడి సంగీత విభావరిని ప్రారంభించారు. అలనాటి పాటలు పాడి సభ్యులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కెపి అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, సభ్యులు కుళ్లాయప్ప, గోవిందు, అస్లాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని 10వ డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి మున్వర్ మృతికి పలువురు టిడిపి నాయకులు నివాళులర్పించారు. మున్వర్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈనేపథ్యంలో పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రగాఢ సంతాపం తెలిపారు. రానున్న రోజుల్లో బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు గంగారామ్, అశోక్, తదితరులు ఉన్నారు.

మినీగోకులం నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు



గోకులం పనులను పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని పుట్లూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లోని పాడి రైతులు నిర్మించుకుంటున్న మినీ గోకులాల నిర్మాణాలను పీడీ సలీంబాషా బుధవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కూలీల సంఖ్య పెంచాలన్నారు. అలాగే మినీగోకులాల షెడ్లను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. సోప్‌పిట్‌లకు త్వరగా ఎస్టిమేషన్ వేసి పంపించాలని టిఎలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిఒ చెన్నకేశవులు, ఇసి విజయనాగేందర్‌రెడ్డి, ఇఎలు, బిఎఫ్‌టిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మొద్దు..పరిహారం అందిస్తాం: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కేశవనాయుడు

అపోహలు నమ్మవద్దని, అమరావతి రోడ్డు వెడల్పులో ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితులందరికీ పరిహారం అందజేస్తామని ఆర్‌డిఒ కేశవనాయుడు సూచించారు. బుధవారం మండలంలోని ముచ్చుకోట గ్రామంలో రోడ్డు విస్తరణలో ఇల్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు ఎలాంటి అపోహలు నమ్మొద్దన్నారు. ఇల్లు కోల్పోయిన వారందరికీ 10రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇంకా ఎవరైనా భూమి కోల్పోయి ఉంటే త్వరలోనే నగదు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజ్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా రోడ్డు నిర్మాణ పనులు

కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



పనులను పరిశీలిస్తున్న కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి

రుద్రంపేట నుంచి కట్టకిందపల్లి వరకూ మెయిన్ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగిపోయిన రుద్రంపేట రోడ్డు నిర్మాణ పనులు బుధవారం నుంచి తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.7కోట్ల ఎస్టిమేషన్‌తో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అలాగే రూ.కోటితో ఎలక్ట్రిసిటీ పనులు చేపడతామని తెలిపారు. అయితే యూటర్న్‌కి రెండు చోట్ల డివైడర్ల మధ్య ఖాళీ స్థలం వదలాలని రుద్రంపేట పంచాయతీ ఉప సర్పంచి నరేంద్రరెడ్డి కాంట్రాక్టర్‌ను కోరగా ఆర్అండ్‌బి అధికారాలతో మాట్లాడి చర్యలు చేపడతామని కాంట్రాక్టర్ తెలిపారు. పనుల ప్రారంభానికి ముందు ఇఇ రాజగోపాల్, డిఇ బాలకాటమయ్య పరిశీలించారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-నార్పల



పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యులు

మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యులు గోవిందరాజులు మాట్లాడుతూ 90శాతం కచ్చితత్వంతో పేయిదూడల పుట్టుక లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకం ప్రాచుర్యం నిమిత్తం శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేయిదూడలను పొందే లింగనిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఎ జిల్లా కార్యనిర్వహణాధికారి టివి.సుధాకర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, ఎహెచ్‌ఎలు అంకిత, ప్రవల్లిక, సంధ్య, గంగాధర్, ఓంకుమార్, నరసప్ప, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళపై కత్తితో దాడి

గుత్తి : పట్టణంలోని కమాటంవీధికి చెందిన మహిళపై బుధవారం ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ కె.సురేష్ బాబు తెలిపిన వివరాల మేరకు కమాటం వీధికి చెందిన లారీ డ్రైవర్ దాదాఖలందర్ మహిళా పొదుపు సంఘానికి సంబంధించిన డబ్బును వాడుకున్నాడు. సంఘం డబ్బులు జమ చేయాలని నజియ అనే మహిళ దాదా ఖలందర్ ను వత్తిడి చేసింది. దీంతో మాటామాట పెరిగి కత్తితో నజీయాను నాలుగు సార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స కోసం స్థానికులు ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఆమెకు మెరుగైన చికిత్స కొరకు వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు



అధికారులతో మాట్లాడుతున్న యల్లనూరు తహశీల్దార్ రాజా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

గ్రామాల్లోని రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 6వతేదీ నుంచి గ్రామసభలునిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ వసంతబాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వతేదీ నుంచి గ్రామాల వారీగా సదస్సులు ఉంటాయన్నారు. ఆయా సదస్సుల్లో తహశీల్దార్, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్, రిజిస్ట్రేషన్, ఫారెస్ట్, దేవాదాయ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొంటారన్నారు. కావున రైతులు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని కోరారు.

నార్పల : మండల వ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న సిద్ధారాచర్ల దుర్గం, 7న సిద్ధరాచర్ల, మాలవాండ్లపల్లి, గొల్లపల్లి, ఎంపీ కొట్టాల, చెరుకు తోటపల్లి, 10దీన బండ్లపల్లి, 11న పప్పూరు, 12న దుగుమర్రి, 13న బొందలవాడ, 17న చామలూరు, 18న హెచ్.శోధనపల్లి, 19న నడిమిదొడ్డి, 20న గూగూడు, 21న వెంకటాంపల్లి, 24న మండల కేంద్రంలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు అధికారులకు వినతిపత్రాలు అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

పుట్లూరు : ఈనెల 6 నుంచి మండలవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6న అరకటవేముల, 7న సూరేపల్లి, 10న దోసలేడు, 11న చింతకుంట, 12న కందికాపుల, 13న మడుగుపల్లి, 17న చిన్నమల్లేపల్లి, 18న గాండ్లపాడు, 19న ఎస్.గూడూరు, 20న కోమటికుంట్ల, 21న గరుగు చింతలపల్లి, 27న పుట్లూరు, 28న చాలువేముల, జనవరి 1న కుమ్మనమల, 3న చెర్లోపల్లి, 4న ఎల్లుట్ల, 5న కడవకళ్లు గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, విఆర్ఒలు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి మండలవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజా తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ రెవెన్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై గ్రామాల్లోని రైతుల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఈనెల 6వతేదీ నుంచి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలను అందజేస్తున్న నాయకులు

పోలీస్‌స్టేషన్‌కు సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలు అందజేత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను సంతే కొండాపురం సర్పంచి వనిత మల్లికార్జున బుధవారం వితరణ చేశారు. ఆయాఫొటోలను ఎస్ఐ నరేంద్రకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూగేపల్లి గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ జరిగే చన్నమల్లప్ప స్వామి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చన్నమలప్ప స్వామి మఠం ఏజెంట్ మల్లికార్జునగౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులేష్, మాజీ ఎంపిపి వన్నూరుస్వామి, నాయకులు మల్లికార్జున గౌడ్, పెంకుల మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

భారత నావికాదళ దినోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి ఆధ్వర్యంలో భారత నావికాదళ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ దేశ రక్షణ దళాల్లో నావికాదళం కీలకమైందన్నారు. సముద్రమార్గంలో రక్షణ కవచంగా ఎల్లవేళలా కాపాడుతూ ఉంటుందన్నారు. వారి దేశ సేవ మరువ లేనిదన్నారు. మాజీ నావికాదళ ఉద్యోగి ప్రకాష్ మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడేట్లు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీనారాయణ, పరీసా ఫిర్దోస్, ప్రసాద్, దేవదాసు, బాబు, విజయకుమార్, ప్రశాంత్, గోవర్ధన్, పాండు, వినోద్, నారాయణ, నాగప్ప, ఎన్‌సిసి క్యాడేట్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు బీమా అండ : ఎడిఎ

ప్రజాశక్తి-గుత్తి

పంటలు సాగు చేసి ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి రాక నష్టపోయిన రైతులకు పీఎం ఫసల్ బీమా, రబీ పంటల బీమా పథకాలు అండగా ఉంటాయని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎడిఎ కార్యాలయంలో పిఎం ఫసల్ బీమా, రబీ పంటల బీమా పథకాలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ వాతావరణ ఆధారిత బీమా పథకం కింద మామిడి, టమోటా, వేరుశనగ, పప్పుశనగ మొక్కజొన్న, జొన్న, వరి పంటలపై దిగుబడి ఆధారిత బీమా చేసుకోవడానికి ఈనెల 15వతేదీ వరకూ గడువు ఉందన్నారు. కౌలు రైతులకు కూడా బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, హెచ్ఓ మిత్రవింద మాధవి, ఎబిసి మండల మేనేజర్ సురేంద్రబాబు, వెంకటేష్, విఎఎ, వీహెచ్ఎ,విఎస్ఎ, ఎంపిఇఒలు, బీమా సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కొండన్న

రాయదుర్గం రూరల్ : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిడిఒ కొండన్న సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సాధారణ, మెడికల్ సెలవులు తీసుకోవాలంటే హెచ్ఆర్ఎంఎస్ అప్రూవల్ చేసుకున్నాకే సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. విధులకు హాజరయ్యే సమయంలో, ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలో బయోమెట్రిక్ విధానం ఉపయోగించాలన్నారు. పంచాయతీల్లో నిర్వహిస్తున్న స్వర్ణ పంచాయతీ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి మురళి, కార్యదర్శులు అశోక్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం రోశయ్యకు నివాళి

రాయదుర్గం : పట్టణంలోని కోటలో ఉన్న నగరేశ్వర స్వామి ఆలయంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్, పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సిఐ యువరాజు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనిఫాం తప్పకుండా ధరించాలని, మైనర్లకు ఆటోలు ఇవ్వకూడదని, ఆటోలకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పకుండా జిరాక్స్ కాపీలను ఉంచుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, డ్రైవర్ సీట్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మద్యం తాగి ఆటోలను నడపరాదని, ఆటోలకు నెంబర్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బులు అధికంగా వసూలు చేస్తే చర్యలు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అపార్ అప్డేషన్ ప్రక్రియను ఆసరాగా తీసుకుని మీసేవ సెంటర్ల నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆధార్‌లో తప్పులు, డేటాఫ్ బర్త్, పేర్లు, అడ్రస్ మార్పు వంటి సమస్యలు అపార్ కార్డు నమోదుకు అడ్డంకిగా మారింది. ఈనేపథ్యంలో అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయంతోపాటు ఆధార్ కేంద్రాలు, పోస్టాఫీసుల వద్ద పెద్దఎత్తున జనం బారులుదీరుతున్నారన్నారు. తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అపార్ అప్డేషన్ కోసం పడుతున్న ఇబ్బందులని విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామన్నారు. త్వరలోనే అపార్ సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు లోకేష్ చర్యలు తీసుకుంటారన్నారు.

'ఉపాధి' పనులపై గ్రామసభ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం మండల పరిధిలోని ఎరడికెర గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ ఫండరీస్ మాట్లాడుతూ సామాజిక తనిఖీలో భాగంగా 2023-24లో గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో రూ.61లక్షలు ఖర్చు చేయగా, రూ.54 లక్షలు ఉపాధి కూలీల వేతనాలు చెల్లించారన్నారు. మిగిలిన రూ.7లక్షలతో హార్టికల్చర్, వర్కింగ్ నేమ్ బోర్డులకు ఖర్చు చేశారన్నారు. ఆయా పనులపై పూర్తిస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి మీరావలి, డిఆర్‌పి చంద్రశేఖర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



రైతులకు మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలంలోని లత్తవరం, విడపనకల్ మండల పరిధిలోని పాల్తూర్, ఉండబండ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పప్పుసెనగ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. దిగుబడి ఆధారిత బీమా కంపెనీ రాష్ట్ర మేనేజర్ అరుణ్, జిల్లా మేనేజర్ మూర్తి, ప్రతినిధులు శ్రీనివాస్, హరి మాట్లాడుతూ ఫసల్‌బీమా యోజన బీమా ప్రీమియం చెల్లించడానికి ఈనెల 15వతేదీ వరకు గడువు ఉందన్నారు. కావున రైతులు వెంటనే బీమా ప్రీమియం చెల్లించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒఇ రాఘవేంద్ర, ఎంపిఇఒలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ముత్యాలు, మెర్సి, గోపాల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పామిడి



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మూతబడిన ఎన్‌టిఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. గత టిడిపి హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్లాంట్ మూతబడింది. ఈనేపథ్యంలో తిరిగి టిడిపి అధికారంలోకి రావడంతో వాటర్‌ప్లాంట్‌ను పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌ప్లాంట్ నిర్వాహకుడు కరూరు శివశంకర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, టిడిపి సీనియర్ నాయకుడు వడ్డే శివ, కాలవగడ్డ రంగనాయకులు, కిట్ట, హరి, తదితరులు పాల్గొన్నారు.